క్లుప్తంగా

ఆలయాల నిర్మాణానికి భూమిపూజ

మందస: పొత్తంగి గ్రామంలో రెండు ఆలయాల నిర్మాణానికి ఆదివారం అంకురార్పణ జరిగింది. ప్రజల సహాయ, సహకారాలతో ఆలయాల నిర్మాణానికి ఇప్పటికే రూ.5 లక్షలు పోగు చేశారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామదేవత చెవిటమ్మతో పాటు భూలోకమాత ఆలయాల నిర్మాణానికి పీఠాల స్థానచలనం, భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మికత చోటు చేసుకుంది. పొత్తంగిలోని పొత్తీశ్వర ఆలయం ఎంతో పురాతనమైనది. మహేంద్రగిరులు యాత్ర జరిగినప్పుడు పొత్తీశ్వరుని భక్తులు దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

యువత శ్రమదానం

మందస: సొండిపూడిలోని శ్మశాన వాటికలో యువకులు ఆదివారం శ్రమదానం చేశారు. నూతన భవన నిర్మాణాని సన్నహాలు చేస్తున్నారు. జైభీమ్ యువత ఆధ్వర్యంలో మిస్క కృష్ణయ్య, దడ్ల కిరణ్‌కుమార్, నగిరి ప్రవీణ్‌కుమార్, కొత్తపల్లి సాగర్, యానాది వాసు తదితరులు ఆధ్వర్యంలో జేసీబీతో పనులు చేశారు. పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు తొలగించి, ఎత్తు, పల్లాలను సరి చేయించారు. యువతను స్థానికులు అభినందించారు.

ఉపాధ్యాయుడికి చిత్రకళ అవార్డు ప్రదానం

టెక్కలి: రావివలస జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎం.నారాయణ మూర్తి బాపు చిత్రకళ అవార్డు అందుకున్నారు. ఈ మేరకు ఆదివారం వివరాలు వెల్లడించారు. బాపు జయంతి వేడుకలు పురస్కరించుకుని ఇటీవల హైదరాబాదులో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి చేతుల మీదుగా అవార్డుతో పాటు జై ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. టెక్కలి మండలానికి చెందిన పలువురు నారాయణమూర్తిని అభినందించారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ఇచ్ఛాపురం రూరల్: కొఠారీ పంచాయతీ పరిధి కొత్త కళింగపూరులో ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.5 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ దుక్క ధనలక్ష్మి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా పంచాయతీ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. పంచాయతీలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ సాడి సహదేవ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు దుక్క ఆనంద్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అభిరాం ఎంపిక


బడ్డ అభిరాం

కవిటి: చెన్నైలో ఈ నెల 24 నుంచి 31వ తేదీ వరకు జరుగునున్న ఖేలో ఇండియా యూత్‌నేషనల్స్ వాలీబాల్ పోటీల్లో పాల్గొంటున్న ఆంధ్రప్రదేశ్ జట్టుకు కవిటి మండలం ప్రగడపుట్టుగకు చెందిన బడ్డ అభిరాం ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని జిల్లా సంఘం సంయుక్తకార్యదర్శి బల్లెడ రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీన విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన ఎంపిక పోటీల్లో అభిరాం మంచిప్రతిభ కనబర్చడం ద్వారా రాష్ట్ర జట్టులో స్థానం దక్కించుకున్నాడు.

గుడి నిర్మాణానికి విరాళం

కవిటి: మండల కేంద్రం కవిటిలోని 160 ఏళ్ల చరిత్ర కలిగిన జగన్నాథస్వామి ఆలయ పునర్నిర్మాణానికి స్థానిక గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ దేవాడ కుమారి, దుర్యోధన దంపతులు రూ. పది వేల విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు ఆలయ నిర్మాణ బాధ్యతలు చేపట్టిన కమిటీ సభ్యులకు నగదును ఆదివారం అందజేశారు. డిసెంబర్ నాలుగో తేదీన 'సాక్షి' పత్రికలో ఆలయ పునర్నిర్మాణానికి దాతలు సహకరించాలి అనేక కథనానికి స్పందించి తనవంతు విరాళాన్ని అందజేస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ నాయకుడు దేవాడ దుర్యోధన తెలిపారు.

విధుల్లో చేరిన పారిశుద్ధ్య కార్మికులు

కోటబొమ్మాళి: ఎంపీపీ రోణకి ఉమామల్లేశ్వరరావు చొరవతో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు ఆదివారం విధుల్లోకి చేరారు. పంచాయతీ ఇన్‌చార్జి ఈవోగా పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంటు చింతాడ సన్యాసి స్థానంలో సరియాపల్లి పంచాయతీ కార్యదర్శి బి.నరేష్‌ను ఈవోగా నియమిస్తూ ఈనెల మొదటి వారంలో జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలు జారీచేశారు. అయితే ఈరోజు వరకూ నరేష్ విధుల్లో చేరకపోవడంతో ఈఓ పోస్టు విషయమై సందిగ్ధత నెలకొంది. ఈ కారణంగా జనవరి నెలకు జీతాలు చెల్లింపు పారిశుధ్య కార్మికులకు అందలేదు. దీంతో వారు వారంరోజులుగా విధులకు హాజరుకాలేదు. ఎంపీపీ ఉమామల్లేశ్వరరావు కార్మికులతో చర్చించి సమస్యను పరిష్కరించారు.

పక్కాగా కులగణన సర్వే

కంచిలి: కులగణన సర్వే పకడ్బందీగా ప్రభుత్వం యంత్రాంగం చేపడుతోందని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. కొల్లూరు సచివాలయం పరిధి ర్తలి గ్రామంలో ఆదివారం చేపట్టిన ఈ సర్వేలో భాగంగా ఎంపీపీ స్వగృహానికి కూడా వెళ్లి ఆ కుటుంబం నుంచి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ కుప్పిలి వెంకటరావు, వాలంటీర్ పైల నందినిలు వివరాలను సేకరించారు.

బడి రూపం మారింది..



సుందరంగా పొల్లాడ ప్రాథమికోన్నత పాఠశాల



ఫేజ్-1	పాఠశాలలు	పనులు	మంజూరైనది	ఖర్చు (లక్షల్లో)
వజ్రపుకొత్తూరు	39	305	928.96	904
మందస	45	347	819.6	695.73
పలాస	23	179	620.97	528.02



గతంలో ఇలా..

కనీస వసతుల్లేక పిల్లలు అల్లాడిపోయేవారు. దాహం వేస్తే గొంతు తడుపుకోవడానికి గుక్కెడు నీరు ఉండేది కాదు. కూర్చోవడానికి కుర్చీలు, చదువు కోవడానికి పుస్తకాలు అందుబాటులో లేక విద్యార్థులు అల్లాడిపోయేవారు. శిథిలమైన భవనాల్లో బిక్కుబిక్కుమంటూ గడిపేవారు. అదంతా గత టీడీపీ ప్రభుత్వంలో పరిస్థితి. నేడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బడి రూపం పూర్తిగా మారిపోయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టితో పాఠశాలలకు మహర్దశ పట్టింది.

'నాడు-నేడు' పథకంతో సరస్వతీ నిలయాల్లో మౌలిక వసతులు కల్పించారు. నూతన భవనాల నిర్మాణం, అదనపు తరగతి గదుల ఏర్పాటు, ప్రహరీలు, డిజిటల్ క్లాస్ రూములు, విద్యా విధానంలో పెను మార్పులతో సర్కారీ బడులు విద్యారంగంలో తమదైన ముద్ర వేసుకున్నాయి. కార్పొరేట్‌కు దీటుగా సగర్వంగా నిలబడుతున్నాయి. పలాస నియోజకవర్గంలో వజ్రపుకొత్తూరు మండలంలో 92, మందసలో 125, పలాసలో 85 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో నాడు- నేడు కార్యక్రమంలో భాగంగా మొదటి విడతగా వజ్రపుకొత్తూరు మండలంలో 39 పాటశాలల్లోరూ.901.81 లక్షలతో మౌలిక సదుపాయాలు కల్పించారు.

–వజ్రపుకొత్తూరు

ప్రభుత్వానిది ముందు చూపు



విద్యారంగం విషయంలో ప్రభుత్వానిది ముందు చూపు. పొల్లాడ ప్రాథమికోన్నత పాఠశాల శిథిలమై ఉంటేది. నాడు-నేడు పథకం మొదటి విడతలోనే రూ.80 లక్షలు వరకు నిధులు మంజూరు చేసి సౌకర్యాలు కల్పించారు. మినరల్ వాటర్ ప్లాంట్ ఇచ్చారు. రూ.20 లక్షలతో అధునాతన టాయ్‌లెట్స్ నిర్మించారు. చిన్నారులకు చక్కగా అర్థమయ్యేలా స్మార్ట్ టీవీలతో విద్యాబోధన చేస్తున్నాం. విద్యార్థుల హాజరు 30 శాతం పెరిగింది.

– వి. హరికృష్ణ, ప్రధానోపాధ్యాయుడు, పొల్లాడ

సౌకర్యాలు సమకూరాయి



ప్రభుత్వ పాఠశాలలంటే గతంలో చిన్నచూపు ఉండేది. వర్షం పడితే కారిపోయి పిల్లలు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం మా గ్రామ పాఠశాలలో అధునాతమైన భవనాలు, వాల్ పెయింటింగ్స్, డిజిటల్ క్లాస్ రూంలు, నూతన భవనాలు, అధునాత బెంచీలను ప్రభుత్వం సమకూర్చింది.

– మార్పు మల్లేశ్వరరావు, పొల్లాడ

ఆహ్లాదంగా ఉంది



మా పాఠశాల అదంగా ఆహ్లాదంగా ఉంది. మా సార్‌లు అర్థమయ్యేలా పాఠాలు బోధిస్తున్నారు. తరగతి గదిలో ఫ్యాన్‌లు అమర్చారు. స్మార్ట్ టీవీ ఉంది. మంచి భవనాలు నిర్మించారు. థ్యాంక్యూ సీఎం జగన్ మామయ్యా.

– మార్పు ఉదయ్, 7వ తరగతి, ప్రాథమికోన్నత పాఠశాల, పొల్లాడ

నేడు మాంసం విక్రయించకుండా సహకరించండి


చేపల విక్రయదారులతో మాట్లాడుతున్న పాండవ శేఖర్, మధు తదితరులు

కవిటి: అయోధ్యలో రామాలయ ప్రతిష్ట నేపథ్యంలో సోమవారం మండల కేంద్రం కవిటిలోని మాంసం, చేపల విక్రయ వ్యాపారవర్గాలు సోమవారం స్వచ్ఛంద బంద్‌కు సహకరించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం కవిటిలో మండల కోఆప్షన్ సభ్యుడు పాండవ శేఖర్, మాజీ సర్పంచ్ ఆరంగి మధు నేతృత్వంలో పలువురు రామభక్తులు ఈ మేరకు పట్టణంలో వ్యాపార, వాణిజ్య సముదాయాలకు తిరిగి ప్రతి షాపుపై రాముడు, హనుమంతుడు జెండాలు ఎగరవేసి పవిత్రతను తెలియజేసేలా ఈ యాగంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మాంసం, చేపల అమ్మకాలు ఒక్కరోజు పాటు నిలిపివేయాలని వ్యాపారులకు కోరడంతో వారంతా సానుకూలంగా స్పందించారు. ఇదిలా ఉండగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ పవిత్ర కార్యక్రమం వేళ పలు ఆధ్మాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ అన్నప్రసాదవితరణ కార్యక్రమాలకు సమాయత్తం అయ్యారు.

మృత్యుంజయేశ్వర ఆలయ ప్రతిష్టకు శుభరాట


శుభరాట కార్యక్రమంలో భక్తజనం

కవిటి: ముత్యాలపేటలో ఫిబ్రవరి 16 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్న మృత్యుంజయేశ్వర స్వామి మోక్షసీతారామస్వామి, గణపతి, సుబ్రహ్మణ్య, నవగ్రహ మండపం, షిర్డీసాయి, అయ్యప్ప దేవాలయాల ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఆదివారం శుభరాట కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పాతిన చంద్రశేఖరం, ఇతర దాతల ఆర్థిక సహకారంతో రూ. రెండు కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఆలయాలన్నీ ఒకే మూహూర్తంలో ప్రతిష్ఠించేందుకు కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఇందులో భాగంగా శుభరాట వేసి అన్నప్రసాదసేవ శాలలు, యజ్ఞశాలల నిర్మాణం తదితర వైదిక కార్యక్రమాల్ని శరవేగంగా చేపడుతున్నట్టు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా భక్తులకు ఆహ్వానం పలికి నాలుగు రోజుల పాటు ఈ ప్రతిష్ఠ ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరు కానున్న ఈ వేడుకలకు అన్నివర్గాల ప్రజల సహాయ సహకారాలతో ముందుకు వెళ్తున్నట్టు చెప్పారు.

అ'పూర్వ' కలయిక


ఒకే వేదికపై కలుసుకున్న పూర్వవిద్యార్థులు

కాశీబుగ్గ: వారంతా చిన్ననాటి స్నేహితులు.. ఒకే చోట చదువుకున్నారు.. పదో తరగతి పూర్తయ్యాక కొంతమంది ఉద్యోగాల్లో స్థిరపడగా.. మరికొంత మంది వ్యాపార రంగాల్లో కొనసాగుతున్నారు. కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1988-89 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పలాస రైల్వే ఇనిస్టిట్యూట్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధురస్మృతులను నేమరేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులు మన్మథరావు, బీఎస్‌రావులతో పాటు పూర్వ విద్యార్థులు రమేష్‌పండా, గుంప తాతారావు, గరక శ్రీనులను తలచుకుంటూ వారి మృతికి సంతాపం తెలియజేశారు. 120 మంది పూర్వ విద్యార్థులందరూ ఒకే చోట చేరవడంతో సందడి నెలకొంది. ఇక నుంచి అందుబాటులో ఉండాలంటూ ఫోన్ నంబర్లు తీసుకోవడంతో పాటు ఈ మధుర జ్ఞాపకాలను తమ సెల్‌ఫోన్లతో బంధించుకున్నారు.

సోషలిజంతోనే దోపిడీ వ్యవస్థ నిర్మూలన


విప్లవ జోహార్లర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పలాస: సోషలిజంతోనే దోపిడీ, పీడిత వ్యవస్థ నిర్మూలన సాధ్యమని సీపీఐ (ఎంఎల్)లిబరేషన్ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ బొడ్డు వాసుదేవరావు, జిల్లా నాయకులు మద్దిల రామారావు అన్నారు. బొడ్డపాడు పంచాయతీ పరిధిలోని మామిడిపల్లిలో ఆదివారం కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మార్క్సిస్ట్ మహాశయ కామ్రేడ్ లెనిన్ చిత్రపటానికి పూల మాలలు వేసి విప్లవ జోహర్లతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లెనిన్ ఆశయాలను అందిపుచ్చుకొని పోరాటం చేయడమే నిజమైన నివాళి అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షకుల హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. హక్కుల సాధన కోసం సంఘటిత పోరాటమే శరణ్యమన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పిన్నింటి నాగేశ్వరరావు, వంకల అప్పయ్య, నేతాజీ బాలరాజు, చంద్రయ్య, జగదీష్ ఉన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

కోటబొమ్మాళి: యాదవ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని యాదవ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు డొక్కరి ధనుంజయరావు అన్నారు. కొత్తపేట శివకేశవ ఆలయం ఆవరణలో యాదవ విద్యా నవ చైతన్య సదస్సు ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చదువులో, ప్రభుత్వ ఉద్యోగనియామకాల్లో మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ బొడ్డు వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు బొడ్డు అప్పన్న, బొడ్డు చెంచులు, ప్రతినిధులు ముద్ద రామదాసు, పిట్ట అప్పారావు, కోనారి సింహాచలం ఉన్నారు.

నేడు మండల సాధారణ సమావేశం

టెక్కలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సాధారణ సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సీహెచ్ లక్ష్మీబాయి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం


పుణ్యవతిని సన్మానిస్తున్న నాయకులు

సంతబొమ్మాళి: టెక్కలి ఏఎంసీ చైర్మన్‌గా నామినేట్ అయిన సగ్గు పుణ్యవతిని మండలంలోని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. దుశ్శాలువ కప్పి జ్ఞాపికను అందజేశారు. ఏఎంసీ సేవలను రైతులకు సక్రమంగా అందించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బి.మోహన్‌రెడ్డి, బి.భూషణరెడ్డి, జె.బాబూరావు, ఆర్.రామిరెడ్డి, జోగి రాములమ్మ, పార్టీ నాయకులు ఎస్.రామ్‌రెడ్డి, అంగ జనార్దన్, అంగ మల్లేసు, కె.అప్పారావు, కోళ్ల భాస్కరరావు ఉన్నారు.

23న హైస్కూల్ అభివృద్ధి కమిటీ సమావేశం

మందస: మందసలోని శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేయడానికి ఓల్డ్ బిల్డింగ్ రెనోవేషన్ ఫోరం ఏర్పడింది. ఇందులో భాగంగా కమిటీ సమావేశాన్ని ఈ నెల 23న హైస్కూలు ఆవరణలో సాయంత్రం నాలుగు గంటలకు ఏర్పాటు చేయడానికి సభ్యులు నిర్ణయించారు. గ్రామపెద్దలు, ఫోరం సభ్యులు హాజరు కావాలని వారు కోరారు.

నారాయణస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు


స్వామి దర్శనానికి క్యూలైన్లో ఉన్న భక్తులు

సోంపేట: పలాసపురం గ్రామంలో కొలువైఉన్న కపిలేశ్వర విరించి నారాయణ స్వామి దేవాలయానికి పుష్య ఆదివారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. పుష్యమాసంలోని ఆదివారం రోజున స్వామిని దర్శించుకుంటే కోరిన కోరికలు తీరుతాయాని ప్రతీతి. నియోజకవర్గంతో పాటు ఒడిశా నుంచి అధిక సంఖ్యలో స్వామివారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పంచాయతీ పాలక వర్గం, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రతిఇంటికీ సంక్షేమం చేరువ

- భీమిలి సభకు తరలిరండి
- జెడ్పీ చైర్‌పర్సన్, నియోజకవర్గ ఇన్‌చార్జి పిరియా విజయ


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ


సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

కంచిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రతిఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిరియా విజయ అన్నారు. ఈ నెల 27వ తేదీన భీమిలిలో నిర్వహించబోయే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర రీజియన్ పార్టీ క్యాడర్ సమావేశానికి తరలి వెళ్లేందుకు సన్నాహక సమావేశాన్ని మండల కేంద్రం కంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు ఆవరణలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. నియోజకవర్గస్థాయి పార్టీ క్యాడర్‌తో నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎంపికైనందుకుగాను కంచిలి మండల పార్టీ నేతలు విజయను దుశ్శాలవతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం జగన్ ప్రజల అవసరాలు తెలుసుకుని..వాటిని నెరవేర్చుతూ ముందుకు వెళ్తున్నారన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే, పార్టీ ఇన్‌చార్జిలను అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించేలా చేశారన్నారు. ఇప్పుడు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకుంటూ మెరుగైన వైద్యసేవలను అందిస్తున్నారన్నారు. 27వ తేదీన సీఎం జగన్ అధ్యక్షతన నిర్వహించనున్న ఉత్తరాంధ్ర రీజియన్ పార్టీ క్యాడర్ సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర నుంచి సీఎం జగన్ ప్రారంభించనున్న ఎన్నికల శంఖారావం సభకు పెద్ద ఎత్తున పార్టీ క్యాడర్ తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపీపీలు పైల దేవదాస్‌రెడ్డి, బోర పుష్ప, నిమ్మన దాస్, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య, ఏఎంసీ చైర్మన్లు బదకల మోహనరావు, నూతలపాటి బాబూరావు, పార్టీ నేతలు కడియాల ప్రకాశ్, ప్రకాశరావు పట్నాయక్, కాళ్ల దేవరాజ్ పాల్గొన్నారు.

విజయం మనందరి లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్


కమలనాభపురంలో నాయకులతో మాట్లాడుతున్న దువ్వాడ శ్రీనివాస్

కోటబొమ్మాళి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాకుళం ఎంపీ, టెక్కలి అసెంబ్లీ స్థానాల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్తలు కృషిచేయాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. కోటబొమ్మాళి మండలం చిన్నసాన, కొత్తపల్లి, సరియాపల్లి, దంత, కురుడు, కిష్టుపురం, మహసాహెబ్‌పేట, తాటిపర్తి, నీలంపేట, పట్టుపురం, కస్తూరిపాడు పంచాయతీల్లో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులను కలిసి పార్టీ విజయానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన ప్రతికుటుంబానికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తున్న నేపథ్యంలో ధైర్యంగా ఓటు అడిగే హక్కు మనకు ఉందన్నారు. మరోమారు జగన్‌మోహనరెడ్డిని ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ప్రతి వ్యక్తికీ ఉందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకటరమణారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళి, వైస్ ఎంపీపీ బోయిన నాగేశ్వరరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు, సర్పంచ్‌లు సుంకరి జనార్ధన, బొనే ఎల్లయ్య, గొండు చాందిని, కోత చిన్నారావు, డి.రామకృష్ణ, జి.గోవిందరావు, బమ్మిడి శ్రీనివాస్, రెడ్డి లక్ష్మణ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి జి.నాగభూషణరావు, జిల్లా రైతుసమాఖ్య సభ్యుడు కవిటి రామరాజు ఉన్నారు.

మంత్రి అప్పలరాజుకు కృతజ్ఞతలు


మంత్రి అప్పలరాజును కలిసిన గ్రామస్తులు

వజ్రపుకొత్తూరు రూరల్: డోకులపాడు గ్రామానికి చెందిన లండ ఆదినారాయణ ఇటీవల సముద్రంలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఇతనికి కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరైంది. పరిహారం మంజూరుకు కృషి చేసిన మంత్రి సీదిరి అప్పలరాజును ఆదివారం గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రిని కలిసి వారిలో మండల సచివాలయ కన్వీనర్ వడ్డి కరుణాకర్, ఎంపీటీసీ సభ్యుడు కొయిరి ఢిల్లేశ్వరరావు, మత్స్యకార సంఘ అధ్యక్షుడు యంపల్ల పాపారావు, మాజీ సర్పంచ్ వడ్డి కామరాజు ఉన్నారు.

నేడు పలు భవనాలు ప్రారంభం

కాశీబుగ్గ/పలాస: మాకన్నపల్లి సచివాలయ పరిధిలో సుమారు ఒకటకోటి రూపాయలతో నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలను మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సోమవారం ఉదయం ప్రారంభిస్తారని సర్పంచ్ సైని దేశయ్య ఆదివారం తెలిపారు. రూ.45 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.21 లక్షలతో నిర్మించిన ఆరోగ్యం కేంద్రం, రూ.15 లక్షలతో చేపట్టిన రెండు చెత్తతో సంపద సృష్టించడానికి నిర్మించిన షెడ్డులు, నీలావతి దగ్గర పూర్తి చేసుకున్న ఆర్‌బీకే, మాకన్నపల్లి పంచాయతీ పరిధి గొల్ల మాకన్నపల్లిలో నాడు-నేడు పథకంలో రూ.12 లక్షలతో పూర్తి చేసుకున్న ఎలిమెంటరీ స్కూల్, రూ. మూడున్నర లక్షలతో చేపటిటన యువజన సంఘం భవనాలను మంత్రి ప్రారంభిస్తారని చెప్పారు.

కారు బోల్తా.. నలుగురికి తీవ్ర గాయాలు

కాశీబుగ్గ: పలాస మండలం కొబ్బరిఊరు జాతీయ రహదారి పక్కన ఆదివారం ఉదయం కారు బోల్తా పడింది. జాతీయ రహదారిపై ప్రయాణిస్తూ కొబ్బరిఊరు దగ్గరకు వచ్చే సరికి డ్రైవర్ నిద్ర మత్తులో జోగడంతో బండి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టింది. దీంతో బండిలో ఉన్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరు కోల్‌కతాకు చెందిన వారు. క్షతగాత్రులను పలాస సామాజిక ఆస్పత్రికి తరలించారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారని సమాచారం.

ఆసరాపై మహిళలకు అవగాహన


మహిళలకు అవగాహన కల్పిస్తున్న కల్పిస్తున్న శిష్టు గోపి, బల్లయ్యనాయుడు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ 19వవార్డు కౌన్సిలర్ శిష్టు బృందావతి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సూదికొండ యూపీస్కూల్ వద్ద వైఎస్సార్ ఆసరా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పట్టణ అధికారి ప్రతినిధి శిష్టు గోపి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా అక్క, చెల్లమ్మలకు చెప్పిన విధంగా నాలుగో విడత రుణమాఫీ చేసి మనసున్న నాయకుడని నిరూపించుకున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బడగల బల్లయ్యనాయుడు, స్థానిక నాయకులు బగాది సింహాచలం, దుమ్ము రాజు, మార్పు చిన్న, స్థానిక డ్వాక్రా మహిళలు, మున్సిపాలిటీ మెప్మా ఆర్‌పీలు స్వప్నకుమారి, మణి ఉన్నారు.

రామనామస్మరణ


టెక్కలి రూరల్: శ్రీరాముని జెండాలు కొనుగోలు చేస్తున్న భక్తులు


సోంపేట: పలాసపురంలో రామనామ సంకీర్తన చేస్తున్న భక్తులు

అయోధ్యలో సోమవారం రామమందిరం ప్రారంభం సందర్భంగా గ్రామాలు శ్రీరామ నామస్మరణతో మారుమోగుతున్నాయి. ఆదివారం వివిధ గ్రామాల్లో రామభక్తులు, వీహెచ్‌పీ ప్రతినిధులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అక్షింతలను పంపిణీ చేయగా.. ఆలయాల్లో పూజలు చేశారు. మందస పట్టణంలోని శ్రీవాసుదేవస్వామి ఆలయంలో సోమవారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.


టెక్కలి :ప్రచారం చేస్తున్న ధార్మిక పరిషత్ సభ్యులు